పెన్ పవర్
10 YEAR ANNIVERSARY 2014 - 2024
తెలంగాణ రౌండప్
మంగళవారం 24 సెప్టెంబర్ 2024 పేజీలు 9

2018 అక్టోబర్ 14న రెవెన్యూ కూల్చివేసిన చోటనే మళ్ళీ నిర్మాణాలు..



# వెన్నెలగడ్డ చెరువు కబ్జాకు..!

# అధికారులే సూత్రదారులు..?

## జీహెచ్ఎంసి సౌజన్యంతో చెరువుల్లో అనుమతులు యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..




కుత్బుల్లాపూర్ సర్కిల్-25 డిప్యూటీ కమిషనర్‌కి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు..

- ఇరిగేషన్ ఎన్‌ఓసి లేకుండానే.. బరితెగించి జీహెచ్ఎంసి నిర్మాణ అనుమతులు..
- చెరువును చుట్టుముట్టిన భూ కబ్జాదారులు..
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో విచ్చలవిడి చెరువుల ఆక్రమణ అంటూ బీజేపీ ఫిర్యాదు..
- కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్‌లో అలంకార ప్రాయంగా అధికారుల విధులు..
- జీడిమెట్ల వెన్నెల గడ్డ చెరువులో ఎఫ్‌టిఎల్, బఫర్‌లో 4 నిర్మాణ అనుమతులు..!
- అక్రమ నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్..
- కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్‌కి, జోనల్ కమిషనర్‌కి ఆకుల సతీష్ ఫిర్యాదు..

-2లో

అధికారుల ముసుగులో చెరువులును మింగేస్తున్నారు..! కబ్జాదారులతో చేతులు కలిపి నిర్మాణ అనుమతులు మంజూరు చేసి, చెరువులు అంతరించి పోయేందుకు..! రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసి, ప్రత్యక్షంగా కారణమవుతున్నారు.. గత పదేళ్ళ పాలనలో బీఆర్ఎస్ పాలకులకు స్వామి భక్తిని చాటుకున్న అధికారుల నిర్వాహకానికి వెన్నెలగడ్డ చెరువు కబ్జాలు నిలువెత్తు నిదర్శనం.. కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 అధికారులు విధుల్లో ఎవరున్నా తప్పుడు అనుమతులు, అక్రమ నిర్మాణాలు కామన్ అయిపోయాయి.. ధనార్జనే ధ్యేయంగా, చట్టంలోని లొసుగులతో, సంబంధిత అధికారులే చెరువులను అమ్ముకుంటుంన్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు..వెన్నా చెరువుగా పిలువబడే వెన్నెల గడ్డ చెరువులో "2018 అక్టోబర్ 14న" కుత్బుల్లాపూర్ తహసీల్దారు దగ్గరుండి భారీ నిర్మాణాలను కూల్చివేయగా..! రెండేళ్ళ విరామం తర్వాత ఓ మాజీ మంత్రి సహకారంతో మళ్ళీ అదే చోట అక్రమ నిర్మాణాలు చేపట్టారు.. తాజాగా మరో నాలుగు అక్రమ కట్టడాలు జీహెచ్ఎంసి అనుమతులతో చేపట్టడం గమనార్హం.. అసలు తప్పు ఎవరిది..? కూల్చివేసిన రెవెన్యూ అధికారులదా..? చెరువులో అనుమతులు ఇచ్చిన జీహెచ్ఎంసి అధికారులదా..? ఇంత బహిరంగంగా సహకరిస్తుంటే..! జీహెచ్ఎంసి కమిషనర్ పట్టించుకోక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది..
మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 23:


వెన్నెలగడ్డ చెరువులో మరో అక్రమ నిర్మాణం..

## కుటుంబ డిజిటల్ కార్డుపై రేవంత్ రెడ్డి సమీక్ష



- కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి కార్యాచరణ చేపట్టాలన్న సీఎం
- ప్రతి నియోజకవర్గంలో ఒక పట్టణం, ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలన్న సీఎం
- డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యుల హెల్త్ ప్రొఫైల్ ఉండాలన్న సీఎం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్డుల జారీ కోసం రాష్ట్రంలోని ఒక్కో నియోజకవర్గంలో

-2 లో

## హైదరాబాద్‌లో భారీ వర్షం... రోడ్లపై నిలిచిన నీరు


- చైతన్యపురి కమలానగర్‌లో మోకాళ్ల లోతు వరకు నిలిచిన నీరు
- విజయవాడ జాతీయ రహదారిపై ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ట్రాఫిక్ జామ్
- తార్నాక, అబిడ్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం

హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈరోజు సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా చాలా ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. దీంతో వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. చైతన్యపురి కమలానగర్‌లో మోకాళ్ల లోతు వరకు నీరు వచ్చింది. నీళ్లు రహదారిపై నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. విజయవాడ జాతీయ రహదారిపై ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ట్రాఫిక్ జామ్

-2 లో




# వెన్నెలగడ్డ చెరువు కబ్జాకు..! అధికారులే సూత్రదారులు..?






వెన్నెలగడ్డ చెరువు నీటిపై తేలియాడుతున్న అక్రమ నిర్మాణం..






- మొదటి పేజీ తరువాయి

కుత్బుల్లాపూర్ గాజులరామారం జీహెచ్ఎంసి సర్కిల్–25 సర్కిల్–26 అధికారులు బరితెగించి విధులు నిర్వర్తిస్తున్నారు.. మున్సిపల్ కార్యాలయానికి అలంకార ప్రాయంగా తయారయ్యారు..చెరువుల ఆక్రమణపై ఫిర్యాదులు పట్టించుకోకుండా అక్రమార్కులకు సహకరించడానికే మొగ్గు చూపుతున్నారు.. కుత్బుల్లాపూర్ సర్కిల్–25 పరిధిలోని జీడిమెట్ల గ్రామానికి చెందిన, వెన్నెలగడ్డ చెరువు 38 ఎకరాల్లో విస్తరించి ఉన్నది.. వెన్నా చెరువు విస్తీర్ణంలో ఎనిమిది ఎకరాలు కబ్జా చేసుకుని కాంపౌండ్ వాల్స్ నిర్మాణంతో పాటు పలు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడం గమనార్హం.. 2023 సంవత్సరంలో జిహెచ్ఎంసి అధికారులు చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో నాలుగు నిర్మాణాలకు ఇన్‌స్టాంట్ అనుమతుల పేరిట నీటిపారుదల శాఖ ఎన్ఓసి లేకుండానే అనుమతులు మంజూరు చేయడం అధికారుల అవినీతికి నిదర్శనం అంటూ బీజేపీ నేత ఆకుల సతీష్ ఆరోపించారు..వెన్నెలగడ్డ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాలు నిర్మిస్తుంటే..! ఇరిగేషన్ ఏఈగా పదవీవిరమణ పొందిన రామారావు..! గత పదేళ్ళుగా ఔట్ సోర్సింగ్ పేరుతో ఏఈగా కొనసాగుతున్న రామారావు (రిటైర్) చర్యలు తీసుకోకుండా సహకరించడంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.. చెరువుల కబ్జాలపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు చేపట్టాలని..! చెరువులో నిర్మాణాలు కూల్చివేసి అక్రమ నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్‌కి జోనల్ కమిషనర్‌కి బీజేపీ నేతలు సోమవారం ఫిర్యాదు చేశారు..

## గ్రీన్‌పార్క్ అవెన్యూ ప్లాట్‌ల పేరుతో.. చెరువులో అక్రమ నిర్మాణాలు..

జీడిమెట్ల వెన్నెలగడ్డ చెరువు (లేక్ఐడి నెం.2840) విస్తీర్ణం 38 ఎకరాలు ఉన్నట్లుగా 2013 లో గుర్తించిన హెచ్ఎండిఏ లేక్స్ విభాగం సైట్‌లో, ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్‌ను స్పష్టంగా పొందుపరిచారు.. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆకుల సతీష్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి కుత్బుల్లాపూర్ సర్కిల్–25 పరిధిలోని జీడిమెట్ల వెన్నా చెరువులో, గత తొమ్మిదేళ్ళుగా ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో మట్టినింపి పూడ్చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు.. చెరువు నీటిలోనే ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడం చూడవచ్చు.. చెరువు దాదాపు 8 ఎకరాల పైచిలుకు కబ్జాకు గురైందని ఆకుల సతీష్ ఆరోపించారు.. ప్రస్తుతం రాష్ట్రంలో ఓఆర్ఆర్‌పలోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు రక్షించేందుకు..! ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, భావితరాలకు బహుమతిగా ఇవ్వాలని ప్రత్యేకంగా హైడ్రా రంగంలోకి దిగింది.. మరోవైపు వెన్నా చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో గ్రీన్ పార్క్ అవెన్యూస్ గేటెడ్ కమ్యూనిటీకి చెందిన వెంచర్‌లోని 4 ప్లాట్‌లకు..! ఎలాంటి ఇరిగేషన్ ఎన్ఓసి లేకుండానే జీహెచ్ఎంసి నిర్మాణ అనుమతులు జారీ చేసిందని పేర్కొన్నారు.. కుత్బుల్లాపూర్ సర్కిల్–25 అధికారులు, అక్రమార్కులకు అనుమతులు మంజూరు చేయడానికే అన్నట్టు విధులు నిర్వర్తిస్తున్నారని ఆరోపించారు..

## లక్షలు దండుకుని లక్షణంగా అనుమతులు జారీ..?

జీడిమెట్ల గ్రీన్ పార్క్ అవెన్యూ గేటెడ్ కమ్యూనిటీ ఆనుకొని ఉన్న వెన్నెలగడ్డ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌లో (ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్ ఎ10–ఎ25) వరకు రెండు చిన్న భవనాలకి, రెండు భారీ భవనాలకి అనుమతులు ఏ విధంగా మంజూరు చేశారని బీజేపీ నేత ఆకుల సతీష్ జీహెచ్ఎంసి అధికారులను ప్రశ్నించారు.. సంబంధిత ఈ 4 భవనాలు ప్రస్తుతం 70 శాతం ఎఫ్‌టిఎల్‌లోనే ఉన్నప్పటికీ..! జిహెచ్ఎంసి అధికారులు ఏ విధంగా అనుమతులు ఇచ్చారో అర్థమవుతుంది.. ఇంత జరుగుతున్నా, నార్త్ ట్యాంక్ డివిజన్ ఇరిగేషన్ అధికారులు, చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు.. సదరు నిర్మాణాలకి ప్రత్యక్షంగా సహకరిస్తున్నారని అర్థమవుతుంది.. పదేళ్ళుగా కుత్బుల్లాపూర్ ఇరిగేషన్ ఏఈగా పనిచేస్తున్న రామారావుకి స్థానిక ఎమ్మెల్యే సహకారం ఉన్నట్లు కనిపిస్తుందని ఆరోపించారు..

## హైదరాబాద్‌లో భారీ వర్షం...

# రోడ్లపై నిలిచిన నీరు

- మొదటి పేజీ తరువాయి

అయింది. జాతీయ రహదారిపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.తార్నాక, ఓయూ క్యాంపస్, లాలాపేట, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, దిల్‌సుఖ్ నగర్, మలక్‌పేట, ముషీరాబాద్, చంపాపేట, సైదాబాద్, సరూర్ నగర్, కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, అబిడ్స్, బహదూర్‌పుర, ఉప్పుగూడ, నాంపల్లి, బషీర్ బాగ్, హిమయత్ నగర్, నారాయణగూడ, ఎల్బీనగర్, నాగోల్, వనస్థలిపురం, ఇబ్రహీంపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, బోయినపల్లి, అల్వాల్, చిలకలగూడ, సుచిత్ర, గుండ్లపోచంపల్లి, బహుదూర్‌పల్లి, సూరారం, కొంపల్లి, చింతల్, మేడ్చల్, దుండిగల్, గండిమైసమ్మ, మల్లంపేట, గోల్కొండ, లంగర్‌హౌజ్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

# కుటుంబ డిజిటల్ కార్డుపై రేవంత్ రెడ్డి సమీక్ష

- మొదటి పేజీ తరువాయి

ఒక పట్టణం, ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని సూచించారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో డిజిటల్ కార్డులపై సమీక్ష నిర్వహించారు. డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యులందరి హెల్త్ ప్రొఫైల్ పొందుపరిచి, దాని ద్వారానే ఆరోగ్య సేవలు అందించాలని సీఎం సూచించారు. అర్హులందరికీ కుటుంబ డిజిటల్ కార్డులు అందేలా చూడాలన్నారు. ఇందుకోసం జిల్లాల వారీగా ప్రత్యేక వ్యవస్థ ఉండాలన్నారు. రాజస్థాన్, హర్యానా, కర్ణాటకలలో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు.వన్ స్టేట్... వన్ డిజిటల్ కార్డు విధానం

ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. రేషన్, ఆరోగ్య సేవలతో పాటు సంక్షేమ పథకాలన్నీ ఒకే కార్డు ద్వారా అమలు చేసేలా ప్రణాళిక చేస్తోంది. కుటుంబ డిజిటల్ కార్డు ద్వారా తెలంగాణలో ఎక్కడైనా సంక్షేమ పథకాలు పొందేలా ప్రణాళికలు చేస్తోంది.

# హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లో రోడ్డు..

# ప్రణీత్ అంటీలలో ఆక్రమణ..!


## కబ్జాలో ఉన్న ఓల్డ్ హైదరాబాద్ రోడ్డును తక్షణమే పునరుద్దరించండి:బీజేపీ నేత ఆంజనేయులు..



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేత ఆంజనేయులు..

**భవిష్యత్తు నగరాభివృద్ధిలో భాగంగా 2031 వరకు, ముందస్తుగా రూపొందించిన హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లోని 100 రోడ్లపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.. ఇక్కడ అక్కడ అనే వ్యత్యాసం లేకుండా ఎక్కడపడితే అక్కడ 100 ఫీట్ల రోడ్లు ఆక్రమణకు గురవుతున్నాయి.. దీంతో భవిష్యత్తులో తీవ్ర ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు లేకపోలేదు.. మల్లంపేట్ ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు కబ్జాకూడా ఈ తరహా కబ్జాకు గురైందే.. మల్లంపేట్ రింగ్‌రోడ్డు సమీపంలోనూ హెచ్ఎండిఏ 100 ఫీట్ల రోడ్డులో సర్వే నెం.102, 103, 105 మీదుగా వెళ్తున్న రోడ్డుపై అవగాహన లేకుండా మున్సిపల్ అనుమతులు జారీ చేయడం విశేషం..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**



మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం మల్లంపేట్‌లో ట్రాఫిక్ నియంత్రించాలంటే ఓల్డ్ హైదరాబాద్ రోడ్డును పునరుద్దరించాలని, బీజేపీ నాయకుడు ఎంబరి ఆంజనేయులు ముదిరాజ్ హెచ్ఎండిఏ, మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు.. వివరాల్లోకి వెళ్ళితే, బాచుపల్లి నుండి రెడ్డీస్ ల్యాబ్, ప్రణీత్ అంటీల మీదుగా మాస్టర్ ప్లాన్‌లో ఉన్న 100 ఫీట్ల రోడ్డును పునరుద్దరణకై సోమవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు.. ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు (విలేజ్ మ్యాప్ ప్రకారం) రోడ్డు స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని, తక్షణమే చర్యలు తీసుకొని 100 ఫీట్ల రోడ్డుని ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు..

ఎంబరి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నాలుగు సంవత్సరాలుగా, శంబిపూర్ నుంచి నుల్లంపేట్ బాచుపల్లి సర్కిల్ వరకు వచ్చే పాత రోడ్డు చిన్నది కావడం వలన..! వాహనాల రద్దీతో గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ అవుతున్నందున..! హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ బాచుపల్లి ప్రణీత్ ఆంటీల మీదుగా కత్వ చెరువు ఔటర్ రింగ్ రోడ్డు వరకు 100 ఫీట్ల రోడ్డు ఉన్నట్టు మాస్టర్ ప్లాన్‌లో ఉన్నప్పటికీ..! హెచ్ఎండిఏ, మున్సిపల్ అధికారులు నిర్మాణ అనుమతుల జారీలో నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.. 100 ఫీట్ల రోడ్డు వెళ్తున్న సర్వే నెంబర్‌లు 83,54,56,41,170/4,170,). అదేవిధంగా మల్లంపేట, బాచుపల్లి విలేజ్ రెవెన్యూ ప్రకారం (170,170/1,39,40,38,37,36,54,56) ఓల్డ్ హైదరాబాద్ బాట ఉన్నట్లు ఆంజనేయులు తెలిపారు.. అయితే ప్రస్తుతం బాచుపల్లి రెడ్డి ల్యాబ్స్ నుంచి మల్లంపేట ఔటర్ రింగ్ రోడ్డు వరకు రోడ్డు ఏర్పాటు చేయడానికి ముఖ్యంగా ప్రణీత ఆంటీల అడ్డంగా ప్రహరీగోడను నిర్మించారని..!రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా మారిందని ఆరోపించారు.. మల్లంపేట్ విలేజ్ వైపు రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు, వెంచర్ నిర్మాణాలు ఉన్నాయని వెంటనే చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేశారు..



- హెచ్ఎండిఏ 100 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి, అడ్డంకులు తొలగించాలని ఫిర్యాదు..
- హెచ్ఎండిఏ అధికారులకి..! నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేసిన ఆంజనేయులు..
- మల్లంపేట్‌లో వాహనాల రద్దీతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌పై ప్రజలు ఇబ్బందులు..
- హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లో డాక్టర్ రెడ్డీస్, ప్రణీత్ ఆంటీల కత్వ చెరువు మీదుగా 100 ఫీట్ల రోడ్డు..
- మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రోడ్డు సర్వే నెం.83, 54, 56, 41, 170/4, 170, మీదుగా..
- మల్లంపేట్ సర్వే 170, 170/1, 39, 40, 38, 37, 36, 54, 56 మీదుగా ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు..

## ప్రజలు, వాహన దారుల ఇబ్బందులు..

దుండిగల్ మండలం మల్లంపేట్‌లో నివశించే ప్రజలు ఉద్యోగులు, వ్యాపారస్తులు ప్రతిరోజూ, మాదాపూర్, కూకట్పల్లి, నిజాంపేట్ తదితర ప్రాంతాలకు వెళ్లడానికి మల్లంపేట రోడ్డు 40 ఫీట్లతో చిన్నగా ఉందని, దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి జనం ఇబ్బందులకు గురవుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.. అడ్డంకిగా ఉన్న అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించి 100 ఫీట్ల ఓల్డ్ హైదరాబాద్ రోడ్డును పునరుద్దరించాలని కోరారు..

## అమీన్ పూర్ లో కూల్చివేతలు



**సంగారెడ్డి, పెన్‌పవర్ సెప్టెంబర్23:** సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం కిష్టారెడ్డిపేట మరియు పటేల్ గూడా గ్రామపంచాయతీ అర్ధరాత్రి వరకు హైడ్రా అధికారులు కూల్చివేతలు నిర్వహించారు. కిష్టారెడ్డిపేట గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 164 లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన మూడు బహుళ అంతస్తులను నేలమట్టం చేశారు. నిన్న ఉదయం ఏడు గంటలకు మొదలైన కూల్చివేతలపర్వం అర్ధరాత్రి ఒంటిగంట వరకు కొనసాగాయి. ఈ కూల్చివేతతో ఒక ఎకరా ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పటేల్ గూడ గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 12 లో నిర్మించిన 25 అక్రమ నిర్మాణాలను పోల్చివేశారు దీంతో మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా కిష్టారెడ్డిపేట పటేల్ గూడ పరిధిలో నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా డిఎస్పి శ్రీనివాస్, ఎమ్మార్వో రాధ, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి , హైడ్రా అధికారులు, రెవెన్యూ శాఖ, పోలీస్ అధికారులు, నీటిపారుదల శాఖ, టౌన్ ప్లానింగ్ ,ఎలక్ట్రిసిటీ అధికారులు పాల్గొన్నారు

## మిస్ యూనివర్స్ గా రియా



**న్యూస్ డెస్క్ పెన్‌పవర్ జైపూర్, సెప్టెంబర్ 23:** మిస్ యూనివర్స్ ఇండియా 2024 కిరీటాన్ని రియా సింఘా దక్కించుకుంది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన మిస్ యూనివర్స్ ఇండియా 2024 గ్రాండ్ ఫినాలే లో రియా విజేతగా నిలిచి ప్రతిష్టాత్మక టైటిల్‌ను కైవలం చేసుకుంది. దీంతో రియా ఇప్పుడు ప్రపంచ మిస్ యూనివర్స్ 2024 పోటీలో భారత్ తరఫున బరిలో నిలిచే అవకాశాన్ని దక్కించుకుంది.ఈ విజయాన్ని అందుకున్న తర్వాత రియా ఆనందానికి హద్దులు లేకుపోయాయి. ఈ కిరీటాన్ని అందుకున్న తర్వాత మీడియాతో మాట్లాడిన ఆమె తన సంతోషాన్ని పంచుకుంది. మిస్ యూనివర్సట్ ఇండియా టైటిల్‌ను గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపింది. తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డాని, ఇంతకు ముందుకు విజేతలుగా నిలిచిన వారి నుంచి చాలా నేర్చుకున్నాని రియా చెప్పుకొచ్చింది.ఇక ఈ ఈవెంట్‌కు న్యాయనిర్ణేతగా నటి, మిస్ యూనివర్స్ ఇండియా 2015 ఊర్వి రౌటేలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఈ సంవత్సరం భారతదేశం మళ్లీ మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకుంటుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక వాస్ మియానిర్స్ పోటీలో ఈ ఏడాది భారత దేశానికి మిస్ యూనివర్స్ కిరీటం కచ్చితంగా వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అలాగే.. మిస్ యూనివర్స్ ఇండియా పోటీలో అమ్మాయిలుందరూ చాలా కష్టపడ్డారని, వారి అంకితభావం అద్భుతమని రౌటేలా కొనియాడారు

# స్కిల్ వర్సిటీకి అనుబంధంగా పాలిటెక్నిక్, ఐటీఐలు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 23:** తెలంగాణలోని ఐటీఐ, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను 'స్కిల్ యూనివర్సిటీ' పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అవసరమైన విధివిధానాలను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరిశ్రమల అవసరాల మేరకు పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా మార్చనున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన సిబ్బంది కొరత లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు.ఐటీఐలు లేని అసెంబ్లీ నియోజకవర్గాలు గుర్తించి నివేదిక ఇవ్వాలని, రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో ఐటీఐలు/ఏటీసీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు. సిలబస్ అప్‌గ్రేడ్ చేసేందుకు నిపుణుల కమిటీ నియమించి, సూచనలు సలహాలు స్వీకరించాలని ఆయన ఆదేశించారు. అవసరమైతే నైపుణ్య యూనివర్సిటీ సహకారం తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్మికశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ వీసీగా సుబ్బారావు..**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' వీసీ, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌తో సహా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, ఇతర నియామకాలపై తుది నిర్ణయానికి వచ్చారు. ఈ యూనివర్సిటీలో భాగస్వాములయ్యే పారిశ్రామికవేత్తలను గుర్తించడంతో పాటు అంతర్జాతీయ సంస్థలకు తగ్గట్లుగా యువతలో 'స్కిల్స్' మెరుగుపరిచేందుకు అవసరమయ్యే చర్యలపై విధానపరంగా పలు నిర్ణయాలను ప్రభుత్వం ఇప్పటికే తీసుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా కేంద్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ ఎకనమిక్ అడ్వయిజర్‌గా పదవీ విరమణ చేసిన వి.ఎల్.వి.ఎస్.ఎస్.సుబ్బారావు పేరును ఖరారు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి. ఇండియన్ ఎకనమిక్ సర్వీసుకు చెందిన సుబ్బారావు సుమారు




మూడున్నర దశాబ్దాల పాటు కేంద్రంలో ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, పెట్రోలియం-నేచురల్ గ్యాస్, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎం.ఎస్.ఎం.ఇ), వాణిజ్యం, మానవవనరులు ఇలా పలు విభాగాల్లో పనిచేశారు. ఉన్నత విద్యావిభాగంలో అదనపు కార్యదర్శిగా పనిచేసినప్పుడు స్కిల్ కౌన్సిల్ ఇన్‌ఛార్జిగా ఆ రంగంలో కృషి చేశారని, అందుకే ప్రిన్సిపల్ ఎకనమిక్ అడ్వయిజర్‌గా పదవీ విరమణ చేసిన ఈయనను వీసీగా నియమించాలని నిర్ణయం తీసుకొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.స్కిల్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో ఛైర్మన్‌తో సహా 15 మంది సభ్యులుగా ఉండే అవకాశం ఉంది. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రను ఇప్పటికే ఛైర్మన్‌గా ఎంపికచేసిన సంగతి తెలిసిందే. ఇక కో-ఛైర్మన్‌గా ఎం.శ్రీనివాస.సి.రాజును నియమించారు. సభ్యులుగా టీంలీజ్‌కు చెందిన మనీష్ సభర్వాల్, సంజీవ్ బిక్ చందాని(ఇన్ఫోఎడ్జ్), కల్లం సతీశ్ రెడ్డి(రెడ్డి లేబొరేటరీస్), సుచిత్ర ఎల్ల(భారత్ బయోటెక్), ఎం.ఎం.మురుగప్పన్(మురుగప్ప గ్రూప్), కేపీకృష్ణన్(కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి), పగిడిపాటి దేవయ్య(ఫిలాంత్రపిస్ట్)తో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా వీసీ, ఇద్దరు డీన్‌లు, పరిశ్రమలు, విద్య, ఆర్థికశాఖ కార్యదర్శులు ఉంటారని తెలిసింది. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, అకడమిక్ కౌన్సిల్ కూడా ఉంటాయి. మూడేళ్లలో 18 విభాగాలు..రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఈ 'స్కిల్ యూనివర్సిటీ'లో మూడు దశల్లో 18 రంగాలకు చెందిన విభాగాల్లో యువతకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

? మొదటిదశలో ప్రధానంగా ఈ-కామర్స్, హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్ & లైఫ్ సైన్సెస్, యానిమేషన్-విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, కన్‌స్ట్రక్షన్ రంగాలకు చెందిన స్కూళ్లు ప్రారంభించనున్నారు.

? ఇక రెండోదశలో ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, తర్వాత డిజిటల్ డిజైన్, ఎలక్ట్రానిక్స్-సెమీ కండక్టర్స్ మొదలైనవి ఉన్నాయి. మొదటి దశలో రెండువేల మందికి శిక్షణతో ప్రారంభించి రెండో దశలో 10 వేల మంది, మూడో దశలో 20 వేల మందికి పెంచాలన్నది లక్ష్యం. కోర్సును బట్టి శిక్షణ 3 నెలల నుంచి ఏడాది వరకు ఉంటుంది.

రిజర్వేషన్ల ప్రకారమే ప్రవేశాలు..

రాష్ట్ర యువతకు ఉపాధి పొందడానికి ఈ స్కిల్ యూనివర్సిటీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల మాదిరిగానే.. ఇందులోనూ రిజర్వేషన్ల వ్యవస్థను పాటిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బోధన రుసుముల ఇస్తామన్నారు. ఇతరులకు ఫీజు తగ్గించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. గతంలో కొన్ని ప్రైవేటు వర్సిటీలు ఏర్పాటు చేసినా.. వాటిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించలేదు. కొద్దిమంది కోసం వర్సిటీలను ధారాదత్తం చేశారు. అన్ని వర్గాలకు ఉపయోగపడేలా అన్ని అంశాలను మా ప్రభుత్వం బిల్లులో పొందుపరిచింది. ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీలు, మైనారిటీలకు పాలకమండలిలో సభ్యులుగా అవకాశం కల్పిస్తామని తెలిపారు

# కేడర్ ను సిద్ధం చేస్తున్న రేవంత్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 23:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థలకు రెడీ అవుతున్నారు. నేతలను అందుకు సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్, బీజేపీలను చావుదెబ్బ తీసి సత్తా చాటాలనుకుంటున్నారు. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే కాకుండా ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలన్న ఆలోచనతో రేవంత్ రెడ్డి ఉన్నారు. అందుకోసం అస్త్రశస్త్రాలను రేవంత్ సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా పథకాలను అందిచి ప్రజల్లోకి వాటిని బలంగా తీసుకు వెళ్లే ప్రయత్నాలను ప్రారంభించారు. అందుకోసమే రేవంత్ రెడ్డి ఈరోజు కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ప్రధాన లక్ష్యం స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు సాగడంపైనే చర్చ సాగుతుంది. తెలంగాణకు కొత్త పీసీసీ అధ్యక్షుడు కూడా రావడంతో అన్ని రకాలుగా ముందుకు వెళ్లి పార్టీని బలోపేతం చేయాల్సిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అందుకోసమే ప్రత్యేకంగా సీఎల్పీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నేతలకు నియోజకవర్గాలుగా బాధ్యతలను అప్పగించి అక్కడి ప్రధాన సమస్యలపై రానున్న కాలంలో దృష్టి పెట్టి నోటిఫికేషన్ కు ముందే ప్రజల మనసులను గెలిచే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో స్థానిక సంస్థల్లో విజయం సాధించాలన్న లక్ష్యాన్ని నేతల ముందు రేవంత్ రెడ్డి ఉంచనున్నట్లు తెలిసింది. దీంతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ను మరింత నిర్వీర్యం చేసేందుకు అవసరమైన ప్రణాళికలను కూడా సిద్ధం చేసుకున్నారు. ఒకవైపు ప్రతిపక్షాలను బలహీనపరుస్తూనే మరొక వైపు మరిన్ని పథకాలను వీలయినంత త్వరగా అమలు చేయాలన్న నిర్ణయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చినట్లు తెలిసింది. ఇందుకోసం రోడ్డు మ్యాప్ ను నేడు సిద్ధం చేయనున్నారని తెలిసింది. ఇప్పటికే అమలు చేసిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మరిన్ని వాగ్దానాలు చేయడమే కాకుండా మిగిలిపోయిన రైతు భరోసా, మహాలక్ష్మి పథకంలో కొన్నింటిని అమలు చేయడంపై నేటి సమావేశంలో చర్చించనున్నారని తెలిసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా రైతు రుణమాఫీ చేశామని, అయితే ఇది రైతుల్లోకి బలంగా వెళ్లలేకపోయిందన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేకుండా ప్రకటనలు చేయడం ప్రత్యర్థి పార్టీలు విమర్శలు చేయడానికి ఊతమిచ్చినట్లయిందని ఆయన అభిప్రాయపడుతున్నారు. అందుకోసమే అందరూ సమన్వయంతో ఒకే మాట మీద ఉండాలని, రైతు రుణమాఫీ అంశంపై కొందరు తప్పు అందరూ మాట్లాడకపోవడమే మంచిదన్న అభిప్రాయంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. మొత్తం మీద నేడు జరుగుతున్న సమావేశంలో నేతలకు రేవంత్ రెడ్డి అన్ని విషయాలపై కూలంకషంగా దిశానిర్దేశం చేయనున్నారని సమాచారం.

# హైడ్రా.... ప్లస్ అవుతుందా... మైనస్ అవుతుందా

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 23:** హైదరాబాద్ మహానగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని చెరువులను, కుంటలను, నాలాలను, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసింది. దీనికి సీనియర్ ఐపీఎస్ రంగనాథ్‌ను కమిషనర్‌గా నియమించింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా నిర్మించిన వారి గుండెల్లో హైడ్రా దడ పుట్టిస్తోంది. హైడ్రా వ్యవస్థ ఏర్పాటు నుంచే దూకుడుగా వెళ్తోంది. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. ఇప్పటివరకు అలా.. వందలాది నిర్మాణాలను కూల్చివేయగా.. ప్రభుత్వానికి వెయ్యి ఎకరాలకు పైగా భూమిని రికవరీ చేశారు. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరినీ ఒకే తీరులో చూస్తే అక్రమ కట్టడాలు కనిపిస్తే వాటిని కూల్చుతూ ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి సిబ్బంది, ఎలాంటి అధికారాలు లేనప్పటికీ హైడ్రా ఓ స్థాయిలో దూసుకుపోయింది. తాజాగా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హైడ్రాకు మరింత బలాన్ని చేకూర్చింది. నిన్నటి కేబినెట్‌లో హైడ్రాకు అడిషనల్ పవర్స్ ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దాంతో ఇప్పటికే ఎక్కడా తగ్గకుండా దూసుకెళ్తున్న హైడ్రా.. కేబినెట్ నిర్ణయంతో తన దూకుడును మరింత పెంచనుంది. ఇప్పుడు దానికి విస్తృత అధికారాలతో పాటు చట్టబద్ధతను కూడా ఇచ్చారు. చెరువులతోపాటు గ్రేటర్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించే వరకూ హైడ్రాకు విశేష అధికారాలు అలానే ఉంటాయని కేబినెట్ స్పష్టం చేసింది. అయితే.. కేబినెట్‌లో మరో నిర్ణయం తీసుకున్నారు. హైడ్రా పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు లోపల 27 అర్బన్, లోకల్ బాడీలకు విస్తరించింది. 51 గ్రామపంచాయతీలను కూడా కోర్ అర్బన్‌లో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే.. ఇప్పటివరకు కేవలం ఒక్క కమిషనర్ రంగనాథ్ మాత్రమే అన్నీతానై ఇదంతా నడిపించారు. కానీ.. తాజాగా ప్రభుత్వం అదనంగా సిబ్బందిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి హైడ్రా ఆపరేషన్స్ కోసం 150 మంది అధికారులతోపాటు 964 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కేటాయించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. హైడ్రా ఏర్పాటు నుంచి రేవంత్ రెడ్డి సర్కార్ పలు విమర్శలు, పలు ప్రశంసలు ఎదుర్కొంటోంది. హైడ్రా ఆపరేషన్స్ బాగుందని చాలా వరకు వినిపిస్తుండగా.. మరికొంత మంది నుంచి మాత్రం పేదల కడుపు కొట్టడానికే హైడ్రా తెచ్చారనే విమర్శలు వచ్చాయి. అయితే.. చాలా జిల్లాల నుంచి కూడా హైడ్రాను తమ జిల్లాల్లోనూ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపించింది. అటు పొరుగు రాష్ట్రమైన ఏపీ నేతల నుంచి కూడా హైడ్రా పై ప్రశంసలు వచ్చాయి. అందులోభాగంగానే తాజాగా.. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు విశేషాధికారాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే.. ఈ నిర్ణయంతో రేవంత్ రెడ్డి సర్కారుకు ప్లస్ కానుందా..? మైనస్ కానుందా..? అనే చర్చ సైతం జోరుగా నడుస్తోంది. పొలిటికల్ లీడర్లు హైడ్రాను ముందు నుంచీ వ్యతిరేకిస్తూ వస్తున్నారు. అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ సైతం హైడ్రాపై అసంతృప్తితోనే ఉన్నాయి. పర్మిషన్లు తీసుకున్న వారి ఇళ్లను ఎలా కూల్చివేస్తారంటే నిలదీస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ముందు ముందు హైడ్రా పనితీరు ఇంకా ఎలా ఉండబోతోంది..? వచ్చిన అధికారాలను ఎలా వినియోగించుకోబోతోందో అని ఆసక్తి నెలకొంది.

**ఎవరేమనుకున్నా...**

హైదరాబాద్ డిజాస్టర్ అండ్ రెస్పాన్స్ అస్సెట్స్ ఏర్పాటుతో చెరువులు, నాలాలు, కుంటలు ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను ఇప్పటికే అనేకమైన వాటిని కూల్చివేసింది. అయితే ఇంకా వందకు పైగా ఫిర్యాదులు హైడ్రా వద్ద ఉన్నాయి. ముఖ్యమైన భవనాలను నిర్మించి అక్కడ వ్యాపారాలు, విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఆసుపత్రులు కూడా నిర్వహిస్తుండటంతో వాటిని కూడా కూల్చాలని రేవంత్ రెడ్డి హైడ్రా అధికారులను ఆదేశించారు. 169 మంది అదనపు సిబ్బందిని హైడ్రాకు కేటాయించడం వెనక కూడా రానున్న కాలంలో హైదరాబాద్ నగరంలో కూల్చివేతలు మరింతగా ఉంటాయాన్న సంకేతాలు పంపినట్లయింది. అసెంబ్లీ సమావేశాల్లో కూడా హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ ను తెచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే అనేక కూల్చివేతలను చేపట్టి యాభై ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న హైడ్రా రానున్న కాలంలో మరింత స్పీడ్ పెంచే విధంగా అడుగులు వేయనున్నట్లు అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. రాజకీయ నేతల ఆక్రమణలను కూల్చివేతలను త్వరలో ప్రారంభిస్తారని తెలిసింది. విద్యాసంస్థలను మాత్రం ఏ ఏడాది వేసవి సెలవుల్లో కూల్చివేతలను చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. మధ్యలో అయితే విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడి విద్యాసంవత్సరం నష్టపోయే అవకాశముందని, తల్లిదండ్రుల నుంచి వ్యతిరేక వస్తుందని భావించి కొంత వెనకడుగు వేసింది. ఈ లోపు న్యాయస్థానంలో వేసిన కేసుల విషయంలోనూ హైడ్రా కొంత సమాచారం ఇచ్చి క్లియర్ చేసుకోవాలని భావిస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా ఉండటంతో కొంత విరామమిచ్చిన హైడ్రా చట్టపరంగా అన్ని క్లియర్ చేసుకున్న తర్వాతనే ముందుకు వెళ్లాలని రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటికే న్యాయపరమైన చిక్కులు తొలగించేందుకు న్యాయనిపుణులతో హైడ్రా అధికారులు చర్చిస్తున్నారు

# కాంగ్రెస్, గులాబీ మధ్య.. బీజేపీ

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 23:** నీరు పల్లమెరుగు.. నిజము దేవుడెరుగు'.. అనేది సామెత. కానీ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఇద్దరు నేతల తీరు చర్చనీయాంశం అయింది. ప్రభుత్వాలతో వారు వారు పొట్లాడకుండా మధ్యలోకి మరో పార్టీని లాగుతుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇరు రాష్ట్రాల్లోనూ ఇదే తరహా రాజకీయం నడుస్తుండడం వెనుక కారణాలు ఏమై ఉండొచ్చు అన్న సందేహాలు వినిపిస్తున్నాయి. వారు ఆరోపిస్తున్న వాటిలో నిజమెంతో తెలియదు కానీ.. మధ్యలోకి కేంద్రాన్ని లాగుతుండడం గమనార్హం.ఏపీలో ఏ చిన్నపాటి ఇష్యూ జరిగినా మాజీముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మధ్యలోకి బీజేపీని లాగుతున్నాడు. చంద్రబాబుపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నిస్తున్నాడు. ఆయనను ఎందుకు ప్రశ్నించడం లేదని అంటున్నాడు. ప్రతీ అంశంలోనూ ఆయన దీనినే ఫాలో అవుతున్నాడు. ఒకవిధంగా ఆయన బీజేపీని రాజకీయంగా బ్లాక్ మెయిల్ చేస్తూ వస్తున్నాడు. అయితే.. నిన్నటికి నిన్న కేటీఆర్ చేసిన రాజకీయం కూడా అలానే ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్ కొనసాగుతోంది. ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసేందుకు నిర్ణయించారు. ఇంటింటికీ నీరు అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అయితే.. తెలంగాణ రాష్ట్రం ఇందుకోసం టెండర్లు ఆహ్వానించింది. ఆ టెండర్లు సూదిని సృజన్ రెడ్డి అనే వ్యక్తి దక్కించుకున్నాడని కేటీఆర్ ఆరోపించాడు. అయితే.. ఆ సృజన్ రెడ్డి స్వయానా సీఎం రేవంత్ రెడ్డి బావమరిది అని ఆరోపించాడు. రేవంత్ నేతృత్వంలో వేల కోట్ల అవినీతికి తెరతీశాడని సంచలన ఆరోపణలు చేశాడు.అంతేకాదు.. మరో అడుగు ముందుకేసి టెండర్లను వెంటనే రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశాడు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపేయాలని కోరాడు. ఆయనను సీఎం పదవి నుంచి దింపడానికి ఈ ఒక్క అవినీతి చాలంటూ చెప్పుకొచ్చాడు. దీనిపై వెంటనే బీజేపీ నేతలు కూడా స్పందించాలని, కేంద్రం ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశాడు. అయితే.. కేటీఆర్ వ్యాఖ్యలను విన్న బీజేపీ నేతలు ఏం మాట్లాడాలో తెలియక సతమతంలో పడ్డారు.వాస్తవానికి.. సృజన్ రెడ్డి అనే వ్యక్తి రేవంత్ సతీమణి తమ్ముడు అయితే ఆయన హయాంలో జరిగిన అవినీతిని కేటీఆర్ బయటపెట్టాలి. ఆధారాలతో సహా నిరూపించాలి. అలా కాకుండా ఎంతసేపూ ముఖ్యమంత్రి బావమరిదికి కాంట్రాక్ట్ ఇచ్చారని ఆరోపిస్తూ వచ్చాడు. ఆయనకు కాంట్రాక్ట్ ఇచ్చారు కాబట్టి అందులో అవినీతి జరిగిందంటూ ఆరోపించాడు. దీంతో కేటీఆర్ రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఆధారాలతో సహా బయటపెడితే కేంద్రం ఆటోమెటిక్‌గా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటుంది కదా..! దానికి బీజేపీ నేతల వరకూ ఎందుకు..? అని ప్రశ్నలు వస్తున్నాయి. పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు ఆ మాత్రం తెలియదా అని అంటున్నారు.కేటీఆర్ ఆరోపిస్తున్నట్లు రేవంత్ బంధువుకు కాంట్రాక్టు దక్కిందే అని అనుకుంటే.. మరి పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో వారి వారి బంధువులకు ఎంత మందికి కాంట్రాక్టులు ఇవ్వలేదు..! కేసీఆర్, కేటీఆర్ బంధువులకు లెక్కలేనన్ని కాంట్రాక్టులు దక్కాయనేది చాలా వరకు ఉన్న ఆరోపణలు. అంటే.. 'మందిది మంగళవారం మనది సోమవారం' అన్నట్లుగా కేటీఆర్ వ్యవహారం నడుస్తోందన్న అభిప్రాయాలూ వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉంటే.. తమ హయాంలోనే రాష్ట్రవ్యాప్తంగా మిషన్ భగీరథ అమలు చేసి ఇంటింటికీ నల్లాలు పెట్టామని బీఆర్ఎస్ గంభీరంగా ప్రకటిస్తూ వచ్చింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వేళ కూడా కేసీఆర్ అదే ప్రచారం చేశారు. మరి ఇప్పుడు కేటీఆర్ ఆరోపణలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ నల్లాలు పెట్టామని బీఆర్ఎస్ భావించినప్పుడు.. మళ్లీ పనులు మిగిలిపోయాయని రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు నిర్వహిస్తోందంటే దేనికి అర్థం..!

# వెలుగులోకి కాళేశ్వరం అక్రమాలు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ కరీంనగర్, సెప్టెంబర్ 23:** బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో రూ.3 లక్షల కోట్ల తాగు, సాగు నీటి ప్రాజెక్ట్‌కు ప్లానింగ్ జరిగింది. వీటిలో ఎక్కువ ప్రాజెక్టుల కాంట్రాక్టులు మేఘా సంస్థకే దక్కాయి. అయితే, ప్రభుత్వ ఇంజినీర్లతో కుమ్మక్కయి అంచనాల పెంపులో కుట్రలు జరిగాయనేది ప్రధాన ఆరోపణ. దీని స్కెచ్ అంతా మేఘా సంస్థలోనే గీశారు. గతంలో ఈఎన్సీగా పని చేసి, తర్వాత మేఘా కంపెనీలో చేరిన వెంకట రామారావు ఇందులో కీలక పాత్ర పోషించాడు. ఆనాడు ఏం జరిగింది? డిజైన్లలో మార్పులు ఎలా జరిగాయి? అంచనాల పెంపు వెనుక దాగిన రహస్యాలు ఏంటి? ఇలా అనేక డౌట్స్‌తో ప్రభుత్వ ఇంజినీర్లపై ఇప్పుడు ప్రశ్నల వర్షం కురిపిస్తోంది పీసీ ఘోష్ కమిషన్. కాళేశ్వరంలో జరిగిన అవకతవకలపై నిజానిజాలు రాబడుతోంది. కానీ, అధికారులు దాటవేత ధోరణిలో ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది.కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ కొనసాగుతోంది. తాజాగా క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు విచారణకు హాజరవ్వగా, వారిని ప్రశ్నించింది కమిషన్. మూడు బ్యారేజీలలో క్వాలిటీ కంట్రోల్ పాత్రపై ప్రశ్నల వర్షం కురిపించింది. బ్యారేజీల సైట్ విజిట్ ఎన్ని రోజులకొకసారి చేసేవారని అధికారులను అడిగింది. రెండు మూడు నెలలకొకసారి అంటూ ఒకరు, అసలు సైట్ విజిట్ చేయలేదని మరొకరు సమాధానం ఇచ్చారు. అన్నారం డిజైన్ సరిగ్గా లేదని, వరదకు తగ్గట్టుగా డిజైన్ చేయలేదని ఈఈ వెల్లడించారు. అంతకుముందు, తెలంగాణ ఇంజినీరింగ్ రీసెర్చ్ లేబొరేటరీకి చెందిన ఆరుగురు అధికారులను కమిషన్ విచారించింది. మూడు బ్యారేజీల కంటే ముందు మోడల్ స్టడీస్ కండక్ట్ చేశారా లేదా వంటి పలు అంశాలపై ప్రశ్నించింది. కానీ, జవాబులు దాటవేసే ధోరణితో ఉండడంతో కమిషన్ మండిపడుతోంది.ప్రభుత్వ ప్రాజెక్ట్ అనగానే, గవర్నమెంట్ ఆఫీసుల్లో ముందస్తు పనులు మొదలుపెడతారు. డిజైన్ల తయారీ, ఇంకా ఇతర పనులకు ప్రిపరేషన్స్ ఉంటాయి. కానీ, కాళేశ్వరం పనులు అలా కాదు. కాంట్రాక్ట్ సంస్థ మేఘా ఆఫీసులో డిజైన్ల తయారీ జరిగింది. ప్రభుత్వ అధికారులను ప్రలోభపెట్టి, భయపెట్టి తమవైపు తిప్పుకున్నారు. ఉద్యోగాలను సైతం పీకేస్తామని చెప్పి, అంతా తమకు అనుకూలంగా మార్చేశారు. దీనిని కరెక్ట్‌గా ఎగ్జిక్యూట్ చేసింది వెంకట రామారావు, శ్రీనివాస్ రెడ్డి. వీళ్లిద్దరూ మేఘా కంపెనీలో చాలా కీలకం. తమకున్న పరిచయాలతో ఇంజినీర్లు తమకు అనుకూలంగా పని చేసేలా ప్లానింగ్ అంతా పక్కాగా అమలు పరిచారు. గతంలో ఈఎన్సీగా పని చేసిన వెంకట రామారావు, రిటైర్డ్ అయిన తర్వాత నవయుగ కంపెనీలో పని చేశాడు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో ఆ కంపెనీకి మేలు జరిగేలా టెండర్లను తయారు చేయించారనే అపవాదు ఉంది. తర్వాత కొన్నేళ్లకు నవయుగ నుంచి మేఘా కంపెనీలో జాయిన్ అయ్యాడు. భారీగా లబ్ధి చేకూర్చేలా అంచనాలను పెంచడంలో ఈయన దిట్ట. ఈయన చీఫ్ ఇంజనీర్‌గా ఉన్నప్పుడు పనిచేసిన వారు 80శాతం మంది తర్వాత ప్రధానమైన పోస్టుల్లో ఉండడంతో, వారందరిని నయానో, భయానో గుప్పిట్లో పెట్టుకుని, చెప్పింది చేసేలా పని కానిచ్చేశారు. డిజైన్లలో ఇష్టం వచ్చినట్టు మార్పులు చేయించారు. నూనె శ్రీధర్, వెంకటేశ్వర్లు, మురళీధర్ రావు, హరి రామ్, అనిత, శ్రీధర్ దేశ్‌పాండే, ఇలా చాలామంది ఈయన చెప్పింది చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయితే, కొందరు కిందిస్థాయి ఇంజినీర్లకు ఏం తెలియకుండానే కథంతా నడిపించారని అంటున్నారు. వెంకట రామారావును విచారిస్తే, కాంట్రాక్టుల లోగుట్టు అంతా బయటపడుతుంది.ప్రాజెక్టుల్లో రివైజ్డ్ ఎస్టిమేషన్ పెంచేశారు. సాధారణంగా ఆలస్యం వల్ల అంచనాలు పెరుగుతాయి. కానీ, కాళేశ్వరంలో మాత్రం టైమ్‌కే పని చేసినా అంచనాలు పెరగడం వెనుక అనేక అనుమానాలున్నాయి. దాదాపు 258 సార్లు అంచనాలు పెంచారని, ఘోష్ కమిషన్ వివరాలు రాబడుతోంది. కమిషన్ దూకుడుతో కొంతమంది అధికారులు ఉద్యోగం వదిలి వెళ్లేందుకు రెడీగా ఉన్నట్టు అధికార వర్గాల్లో తెగ మాట్లాడుకుంటున్నారు. తరతరాలు తిన్నా తరగని సొమ్మును వెనకేసుకున్నారని, అందుకే ముందే ఉద్యోగాన్ని వదిలేందుకు ప్రిపేర్ అయినట్టు భావిస్తున్నారు.

## పైన కేఫ్....... లోపల హుక్కా సెంటర్

స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 23: పైకి బోర్డు మాత్రమే చిలాక్స్ కేఫ్ అని చూపిస్తూ.. లోపల గుట్టు చప్పుడు కాకుండా హుక్కా దందా చేస్తున్న నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఒకప్పుడు హుక్కా అంటే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ వంటి రిచ్ ఏరియాల్లో గుట్టు చప్పుడు కాకుండా సీక్రెట్‌గా బడా బాబులకు మాత్రమే యాక్సెస్ ఉండేవి.కానీ, రోజురోజుకూ మారుతున్న కాలానుగుణంగా గంజాయితో పాటు హుక్కా సెంటర్లు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో గల్లీగల్లీకి హుక్కా కల్చర్ విస్తరించిపోయింది. పోలీసులు పలుమార్లు దాడులు నిర్వహించి కేసులు పెట్టినా తగ్గడం లేదు. ఏకంగా కొంతమంది నిర్వాహకులు పైకి బోర్డు మాత్రం వేరేది తగిలించి లోపల హుక్కా సెంటర్లు నిర్వహిస్తున్నారు. తాజాగా, హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఓ కేఫ్ సెంటర్‌పై పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో పోలీసులకు నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలాక్స్ కేఫ్‌పై పోలీసులు దాడులు నిర్వహించారు. గుట్టు చప్పుడు కాకుండా హుక్కా నడుపుతున్న నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గతంలోనూ రెండు సార్లు హుక్కా నడుపుతూ దొరికినట్లు పోలీసులు వెల్లడించారు.

## రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్ పెన్ పవర్:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు మండలం ముకుందాపురం గ్రామం నుండి కట్టుగూడెం గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన వెంట మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. అనంతరం ఇల్లందు పట్టణంలోని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయనున్నారు

## గోదావరి వరదలకు కుంగిన కాకతీయుల నాటి దేవాలయం

హైదరాబాద్ పెన్ పవర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలానికి ఎగువన కురిసిన భారీ వర్షాలకు గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో గోదావరి మధ్యలో 13వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం కోతకి గురైంది బీటలు బారి శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ ప్రతి సంవత్సరం శివరాత్రి రోజున వీరభద్రుడి కళ్యాణం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతోంది. వీరభద్ర స్వామి కళ్యాణానికి పొరుగు రాష్ట్రాలైన చత్తీస్ గడ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి గిరిజనులు, గిరిజనేతరులువేలాది గా తరలి వస్తారు. ఈ యొక్క వీరభద్రుని ఆలయానికి మరమ్మత్తులు చేయించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# ఇప్పుడు కాకపోతే ఎప్పుడు
# కేసీఆర్ వ్యూహాత్మక మౌనంపై చర్చ

స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ మెదక్, సెప్టెంబర్ 23: కేసీఆర్ నోటి నుంచి వచ్చే మాటలు తూటాల్లా పేలుతాయి. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తాయి. అచ్చమైన తెలంగాణ మాండలికంతో చేసే కామెంట్స్ ముచ్చెమటలు పట్టిస్తాయి. అన్నిటికీ మించి తెలంగాణ ప్రజలకు నచ్చుతాయి. కానీ ఆ మాటలు వినబడి దాదాపు ఐదు నెలలు కావస్తోంది. ఆయన కనిపించడం లేదు. ఆయన మాట వినిపించడం లేదు. కారణం ఏంటి? కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని భావిస్తున్నారా? లేకుంటే వ్యూహాత్మకమా? ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ లో ఇదే ఆసక్తికరమైన చర్చ.తెలంగాణ రాకముందు ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో కేసీఆర్ తన ప్రసంగాలతో రాష్ట్ర ప్రజానీకాన్ని ఆకట్టుకోగలిగారు. ఆయన సభలో మాట్లాడబోతున్నారంటే అందరూ టీవీల ముందు కూర్చునే పరిస్థితి ఉండేది. అలా.. ఉద్యమం చేసే చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టగలిగారు. ఇక రాష్ట్రం ఏర్పాటు నుంచి దశాబ్దకాలం పాటు ఆయన పార్టీకి తిరుగులేకుండా పోయింది. ఏ ఎన్నిక వచ్చినా కూడా గులాబీ జెండానే రెపరెపలాడింది. అటు.. ప్రభుత్వంలోనూ తిరుగులేని నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగారు. దశాబ్ద కాలం పాటు అటు పార్టీలోనూ.. ఇటు ప్రభుత్వంలోనూ ఆయన చెప్పిందే నడిచింది.దశాబ్ద కాలం పాటు ముఖ్యమంత్రిగా కొనసాగిన కేసీఆర్.. మొన్నటి ఎన్నికల్లో అనూహ్యంగా పదవి కోల్పోవాల్సి వచ్చింది. దాంతో అప్పటి నుంచి ఆయన ప్రజల్లోకి వచ్చిన దాఖలాలు లేవు. ఆయనకు సంబంధించిన ఫామ్‌హౌజ్‌లోనే కాలం గడుపుతున్నారు. నేతలతో సమీక్షలైనా.. ఎవరైనా కలవాలన్నా.. అంతా అక్కడే. అంతే తప్పితే ఇంతవరకు బయట కనిపించ లేదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా కూడా ఒకటే చర్చ జరుగుతోంది. కేసీఆర్ మళ్లీ ఎప్పుడు ప్రజల్లోకి వస్తారా..? అని. అయితే.. రాజకీయ చాణక్యుడిగా పేరున్న కేసీఆర్.. ఇలా ప్రజల్లోకి రాకుండా ఉండిపోవడం పైనా పలు కారణాలు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇదంతా ఆయన రాజకీయ చతురతలో భాగమేనని ఆయన అభిమానులు అంటున్నారు.మరోవైపు.. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు కావస్తోంది. ఇచ్చిన హామీలను ఆ పార్టీ అమలు చేయడం లేదని బీఆర్ఎస్ నేతలు చాలా సందర్భాల్లో ఆరోపిస్తూ వచ్చారు. రైతులకు ఇచ్చిన హామీలను సగం వరకే తీర్చారని, ప్రజల హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని అంటున్నారు. అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపైనా ఇంతవరకు కేసీఆర్ మాట్లాడలేదు. ముందు నుంచీ సైలెంటుగానే ఉండిపోయారు. రైతుబంధు, రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందంటూ పెద్ద ఎత్తున విమర్శలు వచ్చినా.. కేసీఆర్ మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. సీనియర్ నేతగా, ముఖ్యమంత్రిగా చేసిన అనుభవంతో తమ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరినప్పటికీ కేసీఆర్ మౌనంగానే ఉండిపోయారు.కాంగ్రెస్ కొలువుదీరినప్పటి నుంచి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తీసుకొస్తోంది. వాటిని మీద విచారణలు నడుస్తున్నాయి. ఆ విచారణ పూర్తయ్యే వరకు ఇలా సైలెంటుగా ఉండిపోవడమే మంచిదని ఆయన భావిస్తున్నారా..? అనే టాక్ సైతం నడుస్తోంది. ఇప్పటికే కాళేశ్వరంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ రిటైర్డు జస్టిస్‌తో విచారణ చేపట్టింది. అలాగే జీఎస్టీ స్కామ్ పైనా విచారణ జరుగుతోంది. ఇంకా గొర్రెల స్కీమ్‌పైనా ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మరో మంత్రి.. మిషన్ భగీరథలోనూ రూ.20వేల కోట్ల అక్రమాలు జరిగాయంటూ ఆరోపించారు. అయితే.. ఎంతసేపూ ప్రభుత్వం బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచాలని ప్రయత్నిస్తున్న తరుణంలో వాటికి దీటైన బదులివ్వాలని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లోనే ఉండి వ్యూహరచన చేస్తున్నారని ఆయన అనుచరులు చెప్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడుతారని అంటున్నారు. మరోవైపు.. ఆయన రాకకోసం కింది స్థాయి కార్యకర్తల నుంచి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు అంతా కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. అలాగే.. పార్టీలకతీతంగా ఉన్న అభిమానులు సైతం ఆయన తొరగా బయటకు రావాలని ఆకాంక్షిస్తున్నారు. పెద్దాయన రావాలి.. మళ్లీ పార్టీకి ఊపు తీసుకురావాలని కోరుతున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ లిస్ట్ పై క్లారిటీ....



స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 23: ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 4 నెలల కాలవ్యవధిలోనే 4,500 ఫోన్లు ట్యాప్ చేసినట్టు అధికారులు గుర్తించారు. అందులో 80 శాతానికి పైగా ఎయిర్‌టెల్ కస్టమర్లే ఫోన్లు ఉన్నట్టు తెలిసింది. ఎయిర్‌టెల్ సర్వీస్ ప్రొవైడర్‌కు సంబంధించిన డేటా మొత్తాన్ని ప్రణీత్ రావు ధ్వంసం చేశారు. కాంగ్రెస్‌కు చెందిన కీలక నాయకుల ఫోన్లను ట్యాప్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు 15 రోజుల ముందు నుంచి కాంగ్రెస్‌కు చెందిన 90 మంది ఫోన్లను ప్రణీత్ రావు ట్యాప్ చేశారు. అప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు, మిత్రులు, అనుచరుల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్టు బయటపడింది. ట్యాపింగ్‌కు పాల్పడిన సమాచారాన్ని మొత్తం కూడా ప్రణీత్ రావు ధ్వంసం చేశారు. టోటల్‌గా 340 జీబీల సమాచారాన్ని ఆయన ధ్వంసం చేసినట్టు తెలిసింది. ఈ ఫోన్ ట్యాపింగ్‌కు గురైన వారి జాబితాలో బీజేపీ నాయకుడు ఈటెల రాజేందర్ పేరు కూడా ఉన్నది. ఈటెల రాజేందర్ ఫోన్‌తోపాటు ఆయన గన్‌మెన్, పీఆర్వో, సెక్యూరిటీ సిబ్బంది ఫోన్లు కూడా ట్యాపింగ్‌కు గురయ్యాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీలో ఇన్‌స్పెక్టర్‌గా చేసిన ప్రణీత్ రావు ప్రధాన నిందితుడిగా ఉన్నారు., ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమంతా.. ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు కనుసన్నల్లో జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో విచారణ ఎదుర్కొన్న భుజంగరావు, తిరుపతయ్య, ప్రణీత్ రావులు కీలక వివరాలు వెల్లడించారు. ట్యాపింగ్ చేసిన పరికరాలను, డేటాను ధ్వంసం చేసినట్టు ప్రణీత్ రావు తెలిపారు. ఇక ఈ వ్యవహారం గులాబీ బాస్ ఆదేశాలతో జరిగిందని, ఎస్ఐబీ చీఫ్‌గా పని చేసిన ప్రభాకర్ రావు పకడ్బందీగా ఈ పని చేయించారని నిందితులు విచారణలో తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ చేయడానికి ఎస్ఐబీ అధికారుల్లో తమకు తెలిసిన.. తమకు నమ్మకస్తులైన అధికారులతో ఈ పనులు చేయించారని వివరించారు. ఇక ఫోన్ ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్న సమాచారాన్ని ఆధారంగా చేసుకుని బ్లాక్ మెయిలింగ్ కూడా చేశారని, బ్లాక్ మెయిలింగ్, ఎక్స్‌టార్షన్ కోసం కొందరు సీబీడీ అధికారులను ఉపయోగించినట్టు విచారణలో తేలింది. ముఖ్యంగా రాష్ట్ర ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల నుంచి డబ్బులను సీజ్ చేయడం, ముందస్తుగా సమాచారాన్ని తెలుసుకుని ఆ రూట్‌లో వెళ్తున్న డబ్బును పట్టుకోవడం వంటివి చేసినట్టు నిందిత అధికారులు దర్యాప్తులో పేర్కొన్నారు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కాకమీదికి వచ్చినప్పుడు ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు ఇక్కడ లేరు. ఆయన వైద్య చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లినట్టు సమాచారం ఇచ్చారు. త్వరలోనే తాను తిరిగి వస్తానని చెప్పారు. కానీ, ఆయన చెప్పిన సమయం గడిచినా రాలేదు. అక్కడి నుంచి హైకోర్టునూ ఆశ్రయించి అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని కోరారు. కానీ, న్యాయస్థానం ఆయన విజ్ఞప్తిని తిరస్కరించింది. ముందుగా ఇక్కడికి వచ్చి విచారణ ఎదుర్కోవాలని సూచించింది. ఆ తర్వాత కూడా ప్రభాకర్ రావు తెలంగాణకు తిరిగి రాలేదు.ఆయనను స్వదేశానికి తీసుకురావడానికి ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో అసలు దోషులు ఎవరనేది తేలాలంటే ప్రభాకర్ రావును ఇండియాకు రప్పించాల్సిందే అనే అభిప్రాయానికి పోలీసులు వచ్చినట్టు తెలుస్తున్నది. ఆధారాలన్నింటినీ ధ్వంసం చేసిన నేపథ్యంలో ప్రభాకర్ రావును దర్యాప్తు చేయడం కీలకంగా మారింది. ఆయనను తిరిగి స్వదేశానికి రప్పించడానికి రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని, ఇందుకు సంబంధించిన పనుల్లో పోలీసులు మునిగిపోయినట్టు తెలిసింది.

# గ్రేటర్ కరీంనగర్ దిశగా అడుగులు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ కరీంనగర్, సెప్టెంబర్ 23:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ కార్పొరేషన్ గా మారనున్నది. కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మరో ఆరు పంచాయతీలను కార్పొరేషన్ లో విలీనం చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 18 ఏళ్ల క్రితం మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ గా మారిన కరీంనగర్ నగర పాలక సంస్థ మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో అడుగు ముందుకు వేస్తుంది. మున్సిపల్ కార్పొరేషన్ ను గ్రేటర్ కరీంనగర్ గా మార్చేందుకు సన్నాహాలు చేస్తుంది. కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు మరో ఆరు గ్రామాలను కార్పొరేషన్ పరిధిలో విలీనం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ కు సూచించారు.ఈ ప్రక్రియ పూర్తయితే త్వరలోనే గ్రేటర్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పడటం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరానికి ఆనుకొని ఉన్న కొన్ని గ్రామాలను గతంలో మినహాయించడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన క్రమంలో మంత్రి పొన్నం ఈసారి వివాదాలకు తావు లేకుండా రెండు మండలాల నుంచి గ్రామాలను విలీనం చేసేందుకు ప్రతిపాదనలు కోరడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.నాలుగున్నర ఏళ్ల క్రితమే కొత్తపల్లి మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. తాజాగా గ్రేటర్ కరీంనగర్ ప్రక్రియలో భాగంగా కొత్తపల్లి మున్సిపాలిటీని కూడా విలీనం చేయాలని నిర్ణయించారని తెలుస్తోంది. కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని చింతకుంట, లక్ష్మీపూర్, మల్కాపూర్ గ్రామాలు, కరీంనగర్ రూరల్ పరిధిలోని బొమ్మకల్, దుర్శేడు, గోపాల్ పూర్ గ్రామాలను విలీనం చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరిన వెంటనే వాటికి ఆమోదం లభించడంతో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ గా మారడం ఖాయమనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.2005లో మున్సిపాలిటీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ గా ఎదిగిన కరీంనగర్ నగరం గడిచిన రెండు దశాబ్దాల్లో శరవేగంగా విస్తరించింది. దీంతో చుట్టుపక్కల గ్రామాలన్నీ కూడా నగరంతో సమానంగా కలిసిపోయాయి. మౌలిక వసతులు లేక నగరాన్ని అనుకొని ఉన్న గ్రామాలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతుండటంతో గత ప్రభుత్వం 2020లో పరిసర పరిధిలోని



ఎనిమిది గ్రామాలను కార్పొరేషన్ లో విలీనం చేసింది. 3.50 లక్షల ఓటర్లు, సుమారు ఐదు లక్షల జనాభా కలిగి ఉన్న నగరంగా ఎదిగిన కరీంనగర్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్ సిటీ పథకం కింద ఎంపిక కావడంతో సుమారు వేయి కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో మరింత ప్రగతి సాధించింది.అయితే గతంలో జరిగిన విలీనం సమయంలో జరిగిన కొన్ని పొరపాట్లు, హైకోర్టు సూచనలు పరిగణనలోకి తీసుకొని పెండింగ్ లో పెట్టిన గ్రామాలను కార్పొరేషన్ పరిధిలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే మంత్రి పొన్నం ప్రభాకర్ కు పలువురు కాంగ్రెస్ నేతలు విన్నవిస్తూ వచ్చారు. అన్ని అర్హతలు ఉన్నా కూడా విలీనం చేయకపోవడంతో కనీస మౌలిక వసతులకు దూరమవుతున్నామంటూ దృష్టికి తీసుకురాగా మంత్రి పొన్నం సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు నగరానికి 10 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలను కార్పొరేషన్ లో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ను కోరారు.2015లో 50 డివిజన్లు ఉండగా.. 2020లో పలు గ్రామాల విలీనం తర్వాత డివిజన్ల సంఖ్య 60కి పెరిగింది. తాజాగా ఒక మున్సిపాలిటీ, అరు గ్రామాలను కూడా విలీనం చేయడం ద్వారా. డివిజన్ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలో 10 వేల వరకు ఓటర్లు ఉండగా.. బొమ్మకల్ జనాభా 12 వేల వరకు ఓటర్లు ఉన్నారు. చింతకుంట పరిధిలో 8100 మంది ఓటర్లు, మల్కాపూర్, లక్ష్మీపూర్ పరిధిలో 4036 మంది ఓటర్లు, గోపాల్ పూర్ పరిధిలో 2633 మంది ఓటర్లు, దుర్శేడు పరిధిలో 3341 మంది ఓటర్లు ఉన్నారని తేలింది. 2020 జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో 2.72 లక్షల మంది ఓటర్లు కార్పొరేషన్ పరిధిలో ఉండగా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగి 3.50 లక్షల వరకు చేరింది. తాజాగా మరో 30 వేల పైచిలుకు ఓటర్లు నగర పరిధిలో చేరనుండటంతో డివిజన్ల సంఖ్య .. డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా కూడా మార్పులుచేర్పులు జరిగే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుత డివిజన్ల హద్దులు కూడా మారడం ఖాయమని తెలుస్తోంది. గతంలోనే డివిజన్ల స్వరూపంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో ఈసారైనా అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించకపోతే మరోమారు అభాసుపాలు కావడం ఖాయమని తెలుస్తోంది.మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గ్రేటర్ కరీంనగర్ గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయనే ప్రచారంతో నగర ప్రజలు స్వాగతిస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు మంత్రిగా ఉన్న ఎమ్మెస్సార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్లే మునిసిపాలిటీ నుంచి కరీంనగర్ కార్పొరేషన్ స్థాయికి ఎదిగిందని, నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తీసుకోవడంతో గ్రేటర్ కరీంనగర్ గా మారబోతుందని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.గతంలో నగరంతో పూర్తిగా కలిసిపోయినా కూడా బొమ్మకల్ గ్రామాన్ని విలీనం నుంచి మినహాయించడం వల్ల తీవ్ర విమర్శలు వచ్చాయని, మల్కాపూర్, చింతకుంట, లక్ష్మీపూర్ ప్రజలు కూడా విలీనానికి సిద్ధంగా ఉన్నా గతంలోనే పెండింగ్ పెట్టారని అందుకే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించి ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చి గ్రేటర్ కరీంనగర్ ను మరింత అభివృద్ధిపరచాలని తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన స్వాగతిస్తున్నామని పలువురు కార్పొరేటర్ లు అభిప్రాయపడుతున్నారు.కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామ పంచాయితీలను మున్సిపాలిటీని కరీంనగర్లో విలీనం చేయడం మంచిదే అంటున్నారు ప్రస్తుతం నగర పాలక సంస్థ పాలకవర్గం బిఆర్ఎస్ కు చెందిన నాయకులు. ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల విలీనం తర్వాత, ఆ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు ఇవ్వకపోవడంతో విలీన ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని అభిప్రాయపడుతున్నారు.ప్రధానంగా తాగు నీరు సరఫరా, రోడ్లు, మురికి కాల్వల అభివృద్ధి, విద్యుత్ సౌకర్యం కల్పించక పోవడం తో విలీనం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతుందంటున్నారు. 1985 సంవత్సరంలో నగరంలో విలీనం అయిన రాంపూర్, రాంనగర్ ప్రాంతాల్లో ఇంకా సమగ్ర అభివృద్ధి జరగలేదని ప్రస్తావిస్తు అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని కోరుతున్నారు.

# బస్ డిపోలో నుంచి బస్సును ఎత్తుకుపోయేందుకు ప్రయత్నం చేసిన దొంగ

**హైదరాబాద్ పెన్ పవర్:**నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలోనీ బస్సు ఆదివారం రాత్రి అపహరణకు గురికావడం కలకలం రేపింది. మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఆర్టీసీ డిపో గోడదూకి అందులోకి ప్రవేశించాడు. ఏపీ 01జి 0076 నంబర్ గల ఆర్టీసీ బస్సును అపరించాడు.
గమనించిన సెక్యూరిటీ సిబ్బంది బస్సును వెంబడించడంతో 3 కి.మి దురలో సోఫీ నగర్ వద్ద బస్సు ప్రమాదానికి గురిఅవ్వడంతో సెక్యూరిటీ సిబ్బంది బస్సును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకొని బస్సు ఎత్తుకెళ్ళిన దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు...

## హైడ్రాతో భయపడుతున్న ప్రజలు

**హైదరాబాద్ పెన్ పవర్:**కూకట్పల్లి నల్ల చెరువులో నిన్న హైడ్రా కూల్చివేతల పై స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం, ఆదివారం వస్తుందంటే హైదారాబాద్ లో ప్రజలు భయంతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, హైడ్రా కమిషనర్ వ్యాఖ్యలకు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. హైడ్రా కూల్చివేతలు చేసాక డెబ్రిస్ తీసివేయకుండా, చెత్తను జమ చేస్తున్నారని, వాటిని తీయకుండా చెరువును ఏ విధంగా కాపాడుతారని ప్రశ్నించారు. నల్ల చెరువులో నిన్న కూల్చివేతలు చేపట్టిన స్థలం పట్టదారులకు చెందిందని, పట్టాదారులకు ఏ విధమైన న్యాయం చేయనున్నారని, చెరువులలో పట్టాలు ఉన్న వారికి నష్ట పరిహారం చెల్లించి, ఆ స్థలాన్ని ప్రభుత్వం తీసుకోని చెరువులను కాపాడుతూ అభివృద్ధి చేయాలని సూచించారు. నిన్న షెడ్లు కూల్చివేస్తున్న సమయంలో అక్కడ ఉంటున్న వారికి కనీసం వారి సామాన్లను తరలించేందుకు సైతం సమయం ఇవ్వకపోవడం దురదృష్టకరమని, హైడ్రా విధి విధానాలను స్పష్టం చేయాలి. రాత్రి నోటీసులు ఇచ్చి, ఉదయాన్నే కూల్చి వేస్తే అక్కడ ఉంటున్న వారి పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. నిన్న కూల్చివేతలలో నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు. శనివారం ఆదివారం హైడ్రా కూల్చివేతల పేరుతో హైడ్రామా చేస్తున్నారని అన్నారు. కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా నిన్న కూల్చివేతలు చేపట్టారని, ప్రజలను సంక్షేమ పథకాల నుండి దారి మళ్లించేందుకు హైడ్రా కూల్చివేతలు చేస్తున్నారని మాధవరం కృష్ణారావు ఆరోపించారు.

## మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హైడ్రా కూల్చివేత

మాదాపూర్ కావూరి హిల్స్ పార్కు స్థలంలో వెలసిన అక్రమ షెడ్లను హైడ్రా సిబ్బంది కూల్చివేసారు. పార్కులో స్పోర్ట్స్ అకాడమి పై గత కొంతకాలంగా కావురి హిల్స్ అసోసియేషన్ పిర్యాదులు చేసింది. దీంతో స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణాలను హైడ్రా అధికారులు తొలగించారు. నిర్మాణాలను తోలగించి కావురిహిల్స్ పార్క్ అని బోర్డు ఎర్పాటు చేసారు. కావురి హిల్స్ అసోషియషన్ నుంచి 25 సంవత్సరాలు తమకు లిజుకు ఇవ్వడం జరిగిందని స్పోర్ట్స్ అకాడమీ నిర్వహకులు ఆరోపించారు. తమ గడువు ముగియక ముందే అన్యాయంగా నిర్మాణాలను తోలగిస్తూన్నరని అంటున్నారు.

## ఆర్టీసీ బస్సులో మందేసీ?..చిందేసీ ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాల్సిన ఆర్టీసీ అధికారులే బస్సులో మందు పార్టీ చేసుకున్నారు. పనిలో పనిగా చిందులేసారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఆర్టీసీ డిపో పరిధిలో జరిగిన ముచ్చట. వివరాల్లోకి వెళ్తే...మొన్న టిజిఎస్ ఆర్టీసీ యూనియన్ పిలుపు మేరకు హైదారాబాద్ ఇందిర పార్క్ వద్ద ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు తెలంగాణ నలుమూలల నుండి ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగానే తొర్రూరు డిపో నుండి 10 మంది ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. తిరిగి హైదారాబాద్ నుండి తొర్రూరు వెచ్చే క్రమంలో మందు షాపు కాడ ఆ మద్యం, మంచింగ్ కు. ముక్క గ్లాసులు, నీళ్లు తీసుకున్నారట. ఇంకేముంది బస్సులో వెనక సీట్లలో మందు కార్యక్రమం షురూ చేసారు. ఇందులో ఆ బస్సు కండక్టర్ కూడా ఉన్నాడు. ఇంతలో బస్సులో ఉన్న ప్రయాణికులకు మందు వాసన గప్పున రాగానే, ప్రయాణికుల్లో ఒకరు లేచి బస్సులో చిన్నపిల్లలు ఉన్నారని అభ్యంతరం చెప్పాడు. అంతే, కండక్టర్ ప్రయాణికులపై విరుచుకు పడ్డాడు. తతంగమంతా వీడియో తీసారు. సంబంధిత అధికారులు స్పందించి అట్టి మందుబాబులకు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## తిరుమల లడ్డూ వివాదంపై నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో అపవిత్ర పదార్థాలు కలపడం భక్తుల మనోభావాలు దెబ్బతినేల వ్యవహారించిన మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండి దాదాపు 300 దేవాలయాలను కూల్చివేసిన హిందూ ద్రోహి జగన్మోహన్ రెడ్డి. ఎంతో ఆరాధ్యంగా భావించే లడ్డును కల్తీ చేసిన వారిని వెంబడే అరెస్టు చేసి తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డు ని అపవిత్రం చేసిన వారిని ఎవ్వరిని కూడా వదిలిపెట్టడు కలియుగ దైవం అయినా శ్రీనివాసుడు అని మండిపడ్డారు.హిందూ దేవి దేవతలను ఎవరైనా సరే కించపరిచిన హిందూ మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఎవరు చేసిన వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నడికూడా యాదగిరి, సామ సంజీవరెడ్డి, జిల్లా నాయకులు గుర్రం మల్లారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్ రెడ్డి . హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ కు మహేష్ బాబు విరాళం



**హైదరాబాద్ పెన్ పవర్:**సినీ నటుడు మహేష్ బాబు దంపతులు సోమవారం నాడు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50లక్షలు విరాళం అందజేసారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చెక్ ను అందజేసారు. ఏఎంబీ తరపున మరో రూ.10లక్షలు మహేష్ బాబు విరాళం అందజేసారు

## ఎస్ ఆర్ కళాశాలలో మరో విద్యార్థు ఆత్మహత్యాయత్నం



**హైదరాబాద్ పెన్ పవర్:**ఖమ్మం నగరంలోని ఓ ప్రయివేట్ జూనియర్ కళాశాల మూడవ అంతస్తు పై నుండి దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య యత్నం చేసాడు. పోలీసు లైన్ లో ఉన్న ఎస్ఆర్ కాలేజ్ క్యాంపస్ లో ఘటన జరిగింది. జూన్ నుండి ఇప్పటి వరకూ వేర్వేరు కారణాలచే ముగ్గురు విద్యార్థులు ఒకే క్యాంపస్ లో మృతి చెందారు. విద్యార్థి కోదాడ గుంపుల తిరుమలగిరి గ్రామానికి చెందిన మట్టిపల్లి లోకేష్ (16) ఆత్మహత్యాయత్నం చేసాడు. తీవ్రంగా గాయపడ్డ విద్యార్థి ని కళాశాల యాజమాన్యం ఆసుపత్రికి తరలించింది. ఫోన్ చేసిన యాజమాన్యం రెస్పాండ్ అవ్వకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఎస్సార్ కాలేజీ వద్ద ఆందోళన చేస్తున్నారు.

## విహార యాత్రలో విషాదం జలపాతంలో ముగ్గురు గల్లంతు

**హైదరాబాద్ పెన్ పవర్:**అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో విహార యాత్రలో విషాదం చోటు చేసుకుంది. జలతరంగిణి జల పాతం వద్ద ఐదుగురు విద్యార్థులు గల్లంతు అయ్యారు. ఒక్కసారిగా వాగు ఉధృతంగా రావడంతో విద్యార్థుల గల్లంతు అయ్యారు. గల్లంతైన వారిలో నలుగురు అమ్మా యిలు, ఒక అబ్బాయి ఉన్నారు. ఇద్దరు అమ్మాయిలను స్థానికులు రక్షించారు. వారిని ఆస్పత్రికి తరలిం చారు. మిగతా ఇద్దరు అమ్మాయి లు, ఓ అబ్బాయి కోసం గాలింపు కొనసాగుతోంది. విహారయాత్రకు మొత్తం 13 మంది విద్యార్థులు వచ్చారు. ఏలూరు ఆశ్రమ మెడికల్ కాలేజీ విద్యార్థులుగా గుర్తించారు.

# అబద్ధం ఆడితే అతికేటట్టు ఉండాలి..

**హైదరాబాద్ పెన్ పవర్:** అబద్ధం ఆడితే అతికేటట్టు ఉండాలి అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు మాజీ మంత్రి హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు. మీటింగ్ అరికెపూడి గాంధీ నియోజకవర్గంలో జరిగిందని ముఖ్యమంత్రిని మర్యాదకపూర్వంగా కలవడానికి వెళ్ళాడంట అని శ్రీధర్ బాబు మాట్లాడడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.'శాసనసభ వ్యవహారాల మంత్రి గారూ.. సీఎల్పీ సమావేశానికి అరికెపూడి గాంధీ వచ్చారు. ఇకనైనా ఫిరాయింపులపై బుకాయింపులు మానండి.. అని నేను ట్వీట్ చేశాను. దాని మీద శ్రీధర్ బాబు తనకున్న చాకచాక్యాన్ని, తెలివితేటలను ఉపయోగించి.. ఏం అంటారంటే.. సీఎల్పీ మీటింగ్ గాంధీ నియోజకవర్గంలో జరిగిందట.. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చాడని శ్రీధర్ బాబు అన్నారు. అధికారిక మీటింగ్‌కు



సీఎం వస్తే.. మర్యాదపూర్వకంగా కలిసేందుకు వస్తారు తప్ప.. పార్టీ మీటింగ్‌కు రారు అనే విషయాన్ని శ్రీధర్ బాబు గ్రహించాలి. సరే గాంధీ గారిది అయితే నియోజకవర్గం.. మరి ప్రకాశ్ గౌడ్ ఎందుకు వచ్చారు..? శ్రీహరి ఎందుకు వచ్చారు..? దానికి సమాధానం చెబుతారా..? అబద్దం ఆడితే అతికేటట్టు అయినా ఉండాలా.?? జనం ఛీఛీ అంటున్నరు. మీరు ఎన్ని అబద్దాలు మాట్లాడుతారు.. ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెబుతాడు. మళ్లీ వీరంతా మీటింగ్‌కు పోతారు. ఇది ఇద్దరి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొట్లాట అని శ్రీధర్ బాబు అంటడు. ఇవాళ్నేమో కలవడానికి వచ్చిండు అంటడు అదే శ్రీధర్ బాబు. కానీ నగ్నంగా బయటపడింది. ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నగ్నంగా బయటపడింది. ఇంకా దాన్ని బుకాయించే ప్రయత్నం, దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరేం చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకుంటున్నారని' హరీశ్‌రావు తెలిపారు.రావు తప్పుబట్టారు.

# ఆసుపత్రులను పరిశీలించేందుకు వెళ్తే అరెస్టులా..?

### ఎందుకింత భయం నీకు రేవంత్..? నిలదీసిన కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:**గాంధీ దవాఖానలో పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కమిటీ అధ్యక్షుడు మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య, సభ్యులు మెతుకు ఆనంద్, డాక్టర్ సంజయ్‌తో పాటు హైదరాబాద్ నగర పార్టీ అధ్యక్షులు మాగంటి గోపినాథ్‌ను గాంధీ ఆస్పత్రి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని, పోలీసు స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆసుపత్రులను పరిశీలించేందుకు వెళ్తే అరెస్టులా..? ఎందుకింత భయం నీకు రేవంత్..? అని కేటీఆర్ నిలదీశారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడంలో ప్రయత్నం చేసిన పార్టీ ఎమ్మెల్యేలను, సీనియర్ నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులలోకి వెళ్లకుండా అడ్డంకులు కల్పించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం కోసమే, స్వయంగా డాక్టర్లు అయిన మా నాయకులు ఆసుపత్రులను పరిశీలిస్తారని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన



తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడినా, ప్రజారోగ్య వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపుతామని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# గాంధీ హాస్పిటల్ పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ

### అడ్డుకున్న పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు



**హైదరాబాద్ పెన్ పవర్:సెప్టెంబర్ 23** గాంధీ హాస్పిటల్ వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. దవాఖానలో పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకున్నది. మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, మాగంటి గోపీనాథ్‌ను అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు. పోలీసు వాహనాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు.గాంధీ సహా రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల అధ్వాన పరిస్థితిని అధ్యయనం చేసేందుకు రాజయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. నేటి నుంచి నిపుణులైన డాక్టర్లతో కూడిన త్రిసభ్య కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించింది. ఇందులో భాగంగా గాంధీ దవాఖానను పరిశీలించాల్సి ఉన్నది. అయితే కమిటీ పర్యటనను కాంగ్రెస్ సర్కార్ అడ్డుకున్నది. రాజయ్య సహా కమిటీ సభ్యులైన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే సంజయ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అనేక నిర్బంధాల నడుమ గాంధీ దవాఖానకు చేరుకున్న కమిటీ సభ్యులతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నుంచి బయటకు రాకుండా భారీగా పోలీసులు మోహరించారు.

# కోహెడ మండలం శనిగరం చెరువును పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రి పొన్నం ప్రభాకర్ కోహెడ మండలం శనిగరం చెరువును పరిశీలించారు. చెరువులో గంగమ్మ కి పసుపు కుంకుమ పూలు వేసి పూజలు చేశారు. గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామ ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గుట్ట నుండి వరద నీరు గ్రామంలోకి, హాస్టల్ లోకి వస్తుందని తెలిపారు. గుట్ట నుండి వచ్చే నీటిని ప్రోక్లెయిన్ ద్వారా డ్రెయిన్ సిస్టమ్ ద్వారా పంపించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం బీసీ హాస్టల్ ను సందర్శించారు. వారికి అందుతున్న ఆహారం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో బోర్ కావాలని, టాయిలెట్స్ ఇబ్బంది ఉందన్న సిబ్బంది వెంటనే అధికారులతో మాట్లాడి హాస్టల్ లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. తంగలపల్లి లో డబుల్ రోడ్డు పనులకు విద్యుత్ స్తంభాలు షిఫ్ట్ కోసం ఇప్పటికే 5 లక్షలు సాంక్షన్ చేసినప్పటికీ పనుల అలస్యంపై అధికారుల వివరణ కోరారు. పోల్స్ త్వరగా షిఫ్ట్ చేసి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.వాటితో మండలంలోని నారాయణపూర్ శ్రీరాములపల్లి, కోహెడ ల కి బిటి రోడ్లు మంజూరు అయ్యాయని గోట్లమిట్ట, నారాయణపూర్ మధ్య హైలెవల్ బ్రిడ్జి మంజూరు అయినట్టు గ్రామస్థుల కు తెలిపారు.పల్లికాయ సబ్సిడీ రాలేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడారు.పర్యటనలో కొహెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద ధర్మయ్య, ఇతర కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎమ్మార్వో సురేఖ, ఎంపిడివో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని యువకుడు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:**గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామం జిబిసి రోడ్డుపై ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం పొన్నూరు వైపు నుంచి ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు వెళుతుండగా అతివేగంగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. షేక్ ఖాసీం (25) అక్కడకక్కడే మృతి చెందగా హను, రబ్బానీలకు తీవ్ర గాయాలయ్యాయి.

## ఎస్టీ బాయ్స్ హాస్టల్లో దారుణం విద్యార్థికి పురుగుల మందు తాగించారు విద్యార్థి మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదిలాబాద్ జిల్లా పిట్టలవాడలోని ఎస్టీ బాయ్స్ పోస్టుమెట్రిక్ హాస్టల్లో ఉంటూ బీఎస్సీ చదువుతున్న రాథోడ్ జితేందర్(20) అనే విద్యార్థిని శుక్రవారం రాత్రి హాస్టల్ బయట నలుగురు వచ్చి అతడిని కొట్టి పురుగుల మందు తాగించారని తోటి విద్యార్థులు అనుమానం వ్యక్తం చేశారు. స్పృహ తప్పి పడిపోయిన అతడు కొంతసేపటికి లేచి నగేష్ అనే తన బందువుకు ఫోన్ చేసి చెప్పగా ఆయన వచ్చి తోటి విద్యార్థులతో కలిసి జితేందర్ ను రిమ్స్ కి తరలించారు. పరిస్థితి విషమించటంతో అతడిని ఆదిలాబాద్ లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.. ఇటీవల తీజ్ వేడుకలో అతడికి చోర్గాంలో కొందరితో వివాదం నెలకొందని, వాళ్లే ఇలా చేశారని గ్రామస్థులు అనుమానిస్తున్నారు.

## అమెరికాలో మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్ కు ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రధాని మోదీ అమెరికా పర్యటన వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అమెరికాలో ప్రవాస భారతీయుల సదస్సు ఏర్పాటు చేయగా ప్రధాని మోదీ దీనికి హాజర య్యారు.

అయితే ఈ ఈవెంట్ లో అనేకమంది ఇండియన్ కళాకారులు ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వగా మన మ్యూజిక్ డైరెక్టర్ దేవి ప్రసాద్ కూడా స్పెషల్ ప్రఫార్మెన్స్ ఇచ్చారు. పుష్ప సినిమాలోని శ్రీవల్లి సాంగ్ తో అక్కడి ప్రేక్షకులని అలరించారు.

అనంతరం దేవి ప్రసాద్, హనుమాన్‌కైండ్, ఆదిత్య గాధ్వి. హర్ ఘర్ తిరంగా పాట పాడుతూ ప్రధాని మోదీకి స్టేజిపైకి ఆహ్వానం పలికారు. స్టేజిపైకి వచ్చిన ప్రధాని మోదీ, దేవి ప్రసాద్ ని దగ్గరకు తీసుకొని కౌగలించుకొని అభినం దించి ప్రశంసల




వర్షం కురిపించారు.దేవితో పాటు స్టేజిపై ఉన్న మిగిలిన కళాకారులను కూడా దగ్గరకు తీసుకొని మోదీ అభినందించారు. దీంతో ఆ వీడియోలు వైరల్ గా మారాయి.

అమెరికాలో ప్రవాస భారతీయుల ఈవెంట్లో స్టేజిపై మన మ్యూజిక్ డైరెక్టర్ దేవి ప్రసాద్ ని ప్రధాని మోదీ అభినందిం చడం విశేషం.

## ఈనెల 28న జరుగు జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**సమయాన్ని డబ్బులను ఆదాచేసుకోవాలి కక్ష కారుణ్యాల తో ఏమీ సాధించలేము, రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్లేనని కరీంనగర్ పోలీసు కమిషనర్ బి అనురాధ అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుంది. 28-09-2024 నాడు జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో మరియు ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని, జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## గాంధేయ మార్గంలో సర్పంచ్ ల నిరసన

**హైదరాబాద్** సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని... సచివాలయం ముందు ఉన్న తెలంగాణ అమరవీరుల స్మారకం ముందు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల జేఏసీ ఆందోళనకు దిగింది.

జేఏసీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్ మాట్లాడుతూ గ్రామలలో పలు అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు ఇవ్వక... వడ్డీలు తెచ్చిన అప్పుల వారికి చెల్లించక వేదింపులకు గురౌతున్నాము. సొంత డబ్బులు పెట్టి గ్రామాలు అభివృద్ధి చేస్తే...ప్రభుత్వాలు బిల్లులు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. సర్పంచులు కుటుంబాలు చిన్నాబిన్నం అయ్యే పరిస్థితులలో ఉంది. కొంత మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు. సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించిన తరువాతే గ్రామ పంచాయతి ఎన్నికలు నిర్వహించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని అన్నారు.

అమరవీరుల స్మారకం ముందే బైఠాయించడంతో పోలీసులు సర్పంచ్ లను అరెస్ట్ చేసారు. ఈ సందర్భంగా పోలీసులకు సర్పంచ్ లకు తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరిగింది.

## మీసేవ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దేశబోయిన అనిల్ కుమార్

**కార్యదర్శిగా నరేష్ , కోశాధికారిగా పెనుగొండ నాగేందర్**



**మహబూబాబాద్,**
మహబూబాబాద్ జిల్లా మీసేవ యూనియన్ సభ్యుల ఎన్నికను మహబూబాబాద్ లోని అనంతాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం రోజున మీసేవ గౌరవ అధ్యక్షులు శ్రీనివాస చారి ,పిన్ని రాము ఆధ్వర్యంలో మీ సేవా యునియన్ ఎన్నికను నిర్వహించగా జిల్లా అధ్యక్షుడిగా దేశబోయిన అనిల్ కుమార్, కార్యదర్శి గా నరేష్, కోశాధికారిగా పెనుగొండ నాగేందర్ నూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దేశ బోయిన అనిల్ కుమార్ మాట్లాడుతూ

మహబూబాబాద్ జిల్లా చరిత్రలో తొలిసారిగా 100కు పైగా మీసేవ సెంటర్ల సభ్యులందరం కలిసికట్టుగా భవిష్యత్తులో ప్రజలకు అందించ వలసిన సేవలపై, మా యొక్క సమస్యలపై మీసేవ యూనియన్ ద్వారా పరిష్కరించు కునేందుకు, నూతన యూనియన్ ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని భవిష్యత్తులో కలిసికట్టుగా ఒకరి కొకరు సహకరించు కుంటూ ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పులను యూనియన్ ద్వారా ప్రజలకు తెలియ పరుస్తూ అందరికీ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. అనంతరం యూనియన్ సభ్యుల ఎన్నికను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## ఈ నెల25న బోగే రాజారాం సంతాప సభను విజయవంతం చేయండి

తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు స్వర్గీయ బోగే రాజారాం మూడవ వర్ధంతి సభను ఈనెల 25న మంథని అంబేద్కర్ సంఘ భవనంలో జరుపుతున్నామని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సోమవారం తెలిపారు. ఈ సంతాప కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు జేబీ రాజు, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ ఐలయ్య, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ వెంకయ్య లతో పాటు దళిత సంఘాల ఉద్యమకారులు హాజరవుతారని వారు తెలిపారు. కావున రాజారాం అభిమానులు అంబేద్కర్ రిస్టులు, దళిత సంఘాల ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై సంతాప సభను విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క రవి, డివిజన్ అధ్యక్షులు రామగిరి కుమార్, మండల అధ్యక్షులు జంజర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు